క్లుప్తంగా

గ్రంథాలయం తెరవాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న పాఠకులు, స్థానికులు

తవణంపల్లె: స్థానిక గ్రంథాలయాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతూ స్థానికులు గురువారం ఆందోళన చేశారు. ప్రభుత్వం జాతీయ గ్రంథాలయ ఉత్సవాలను నిర్వహిస్తున్నా తవణంపల్లె గ్రంథాలయాన్ని కనీసం తెరవకపోవడం దారుణమన్నారు. జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన తవణంపల్లె గ్రంథాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేసుకున్నట్టు తెలిపారు. రెండేళ్ల క్రితం లైబ్రేరియన్ సుబ్రమణ్యం బదిలీ అయ్యారని, తర్వాత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గ్రంథాలయాన్ని మూసేశారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ అధికారులు స్పందించి వెంటనే గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

గంగనపల్లెలో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ట్రాన్స్‌కో మిట్టూరు సెక్షన్ పరిధిలోని గంగనపల్లెలో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ అంతరాయం స్థానికులు ఇబ్బందికి గురిచేసింది. స్థానికంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో జంపర్ కట్ అవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. అర్ధరాత్రి 12 నుంచి 3 వరకు క్యాంఫోర్డ్ పాఠశాల సమీపంలో సరఫరా లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. సిబ్బంది అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు పునరుద్ధరణ పనులు చేసి యథావిధిగా విద్యుత్ సరఫరా చేశారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



పురుషోత్తం (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఏఆర్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పురుషోత్తం గురువారం వేకువజామున గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. ఐరాల మండలం బెస్తపల్లెకు చెందిన ఈయన చిత్తూరు పీసీఆర్ కళాశాల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండెపోటుకు గురై అక్కడిక్కడికే కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

పట్టాలిచ్చారు.. స్థలం చూపలేదు

చిత్తూరు రూరల్: జీడీనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాశిపల్లె పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి..స్థలం చూపలేదని ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షులు రెహమాన్ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఇళ్ల పట్టాలిచ్చినా స్థలాలు చూపకపోవడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారికి స్థలాలు ఇప్పించాలని కోరారు.

పలుచోట్ల గాలివాన బీభత్సం



కుప్పం: విద్యుత్ తీగలపై పడిన స్టేడియం రేకులు

కుప్పం: పట్టణంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. వడ్డిపల్లి వద్ద ఎన్టీఆర్ స్టేడియం పైకప్పు రేకులు ఎగిరి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. ఒక విద్యుత్ స్తంభం విరిగిపోగా, పట్టణంలో గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది తక్షణం స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. అలాగే మండలంలో వడగండ్ల వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మామిడి చెట్లపై వడగండ్లు పడడంతో పెద్ద ఎత్తున పంట దెబ్బతినింది. టమాటా, వంగ తదితర పంటలు కొంత వరకు దెబ్బతిన్నాయి.

ఊరటనిచ్చిన వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

నగరి : మండలంలో వారం రోజులుగా తీవ్ర ప్రతాపం చూపిస్తున్న ఎండ వేడిమి నుంచి గురువారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఉదయం నంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కాసినా మధ్యాహ్నం మబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న జనానికి కాసింత ఊపిరి పీల్చుకున్నారు. గాలితో పాటు కురిసిన ఈ వర్షానికి పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలపై విరిగి పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుని చెట్లను తొలగించి తెగిన విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ సరఫరా అందించారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- వైఎస్సార్ జలకళ కింద రైతులకు బోరు మోటార్లు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మిందలో గురువారం వైఎస్సార్ జలకళ పథకం కింద రైతులకు బోరు మోటార్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. రైతాంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారన్నారు. పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం వంటివి అందిస్తూ రైతులకు చేయూతనిస్తున్నారన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద ప్రభుత్వం ఇటీవల ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. వాటికి బోరు మోటార్లను కూడా ఉచితంగా ఇస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు వ్యవసాయరంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు త్యాగరాజులు, ప్రతిమా రెడ్డి, మునిరత్నం, నంద, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఏపీఓ రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సమాయత్తం కావాలి

- జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్ర ఉప సంచాలకులు గోపాల్



మాట్లాడుతున్న ఉప సంచాలకులు గోపాల్

చిత్తూరు రూరల్: ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులు పంటల సాగుకు సమాయత్తం కావాలని, మెలకువలు పాటించి, మేలైన దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్ర ఉపసంచాలకులు గోపాల్ అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆయన ఖరీఫ్ సీజన్‌లో రైతులు పాటించాల్సిన మెలకువలు, సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత వేరుశనగ సాగులో విత్తన శుద్ధి గురించి వివరించారు. విత్తుకు ముందు లోదుక్కులు చేసుకోవాలని సూచించారు. తొలుత భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివరాజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే సంతాపం



బాలాజీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లె సర్పంచ్ బాలాజీ రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రాత్రి ఎద్దులవారిపల్లెకు వచ్చారు. బాలాజీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తులసీ రామకృష్ణారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. చిత్తూరు నగరం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం మహిళా సూక్ష్మ వ్యాపార రుణ అనుసంధాన కార్యక్రమంలో భాగంగా ఏపీఎం, సీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్వాక్రా సభ్యులకు పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, స్టాండప్ ఇండియా పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తి గల మహిళలను సూక్ష్మ వ్యాపారవేత్తలుగా గుర్తించాలన్నారు. వారికి తగిన రుణ సదుపాయం కల్పించేలా చూడాలని సూచించారు. ఇందుకు అవసరమైన శిక్షణ అందించేందుకు ఏపీఎం, సీసీలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు మేనేజర్లు పాల్గొన్నారు.

రామరథానికి వస్త్రాలంకరణ



చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీకోదండరామ స్వామి ఆలయ రథానికి బుధవారం వస్త్రాలంకరణ చేశారు. ఇటీవల ఆలయానికి నూతన రథాన్ని తయారు చేయించారు. ఈ నేపథ్యంలో దాతలు, రథానికి వస్త్రాలంకరణ చేసి ట్రయల్ చూశామని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు పుష్పపల్లకీ సేవ

చిత్తూరు రూరల్: గంగజాతర పురస్కరించుకుని చిత్తూరులోని దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం పుష్పపల్లకి కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించనున్నట్టు ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు 1008 బిందెలతో జలాభిషేకం, సాయంత్రం అమ్మవారికి పసుపు అలంకారం, రాత్రి 9 గంటలకు పుష్పపలకీ సేవ నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

ప్రణాళికతో ఖరీఫ్ సాగు

పూతలపట్టు: రైతులు ఖరీఫ్‌లో ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని తెలిపారు. ఆమె గురువారం పూతలపట్టు మండలం చిటిపిరాళ్ల రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా వేరుశనగలో పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. ఏఓ మధురవాణి, ఏఈఓ లత పాల్గొన్నారు.

పశువులకు వేసవి దెబ్బ

- నిర్లక్ష్యం వహిస్తే మరణించే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యులు



వేసవి తీవ్రతకు చెట్లకింద సేదదీరుతున్న పశువులు

గుడిపాల: వేసవిలో మనుషులతో పాటు పశువులు కూడా వడదెబ్బకు గురవుతున్నాయి. వేసవి కాలంలో పశుపోషణ పరంగా నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురై మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ నివారణ గురించి గుడిపాల పశువైద్యాధికారి సాయిసుధ రైతులకు పలు సలహాలు– సూచనలు ఇచ్చారు. వడదెబ్బ లక్షణాలు, చికిత్స, నివారణ గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు

నల్లజాతి పశువులకు ఎక్కువ ప్రమాదం

ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాలు, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు, అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు పశువులు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.

వేసవిలో బయటి ఉష్ణోగ్రతలు పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతుంది. ఆ సందర్భాల్లో చర్మంపై గల స్వేద గ్రంథులు పశువులకు అధిక ఉష్ణోగ్రతలకు లోనుకాకుండా కాపాడుతాయి. అదే సమయంలో చమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడివేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల మూత్ర విసర్జన కుంటుపడుతుంది.

లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీ ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటివెంట చొంగ కారుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడకోసం చెట్ల కిందకు చేరతాయి. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు దాటితే శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్ లక్షణాలతో పశువులు క్రమంగా అపస్మారక స్థితికి చేరి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీనుంచి 106డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవిస్తుంది. వడదెబ్బ వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడి తాత్కాలిక వంధ్యత్వం కలుగుతంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.

నివారణ చర్యలు

- పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ వహిస్తే వడదెబ్బ నుంచి పశువులను రక్షించుకోవచ్చు. వేసవిలో పగటివేళ పశువులకు మేతకోసం బయటకు వదలరాదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి. తాగునీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి.
- పశువులను రోజూ మూడుసార్లు శుభ్రమైన నీటితో కడగాలి. నాటుజాతి పశువుల కంటే సంకరజాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను వాటిలో సేదదీరేలా చూడాలి.
- వెలుతురు, గాలి బాగా ప్రసరించేలా ఎతైన పశువులపాకను గడ్డితో నిర్మించుకోవాలి. వడగాలి తగలకుండా గోనె సంచులు కప్పాలి.
- మురుగు, కలుషిత నీరు తాగకుండా చూసుకోవాలి.

చల్లని ప్రదేశంలో ఉంచాలి



పశువులు వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే రైతులు వాటిని నీటితో కడిగి, చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకు పలు మార్లు నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి తగిన చికిత్స చేయించాలి.

– సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. ఆయన గురువారం పోలవరం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. 430 గడపలు తిరిగి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారికి బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోల్లోని ఇచ్చిన హామీలను 98 శాతం నిరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుంతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్వీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, జీవరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వావిల్‌తోట పంచాయతీలో గడప గడపకూ..

వావిల్‌తోట పంచాయతీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.



లబ్ధిదారులకు బోరు మోటార్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబు

రైతుల సంక్షేమమే ధ్యేయం

బంగారుపాళెం: అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. ఆయన గురువారం వైఎస్సార్ జలకళ కింద ఉచిత బోర్లు వేసుకున్న రైతులకు బోరు మోటార్లు, స్టార్టర్లు, పైపులు, వైర్లు అందజేశారు. జలకళ పథకం కింద కాటప్పగారిపల్లె, నలగాంపల్లె పంచాయతీలకు చెందిన రైతులు చిరంజీవి, అక్కులమ్మ పొలాల్లో ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేయించింది. ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంత రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ జలకళ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు



చిల్లగుండ్లపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందిస్తోందని డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని చిల్లగుండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ సెల్వరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ అనసూయ, ఏఎన్‌ఎంలు ఉమ, శోభ, ఆశావర్కర్లు జగద, వసంత పాల్గొన్నారు.

నెల్లిమండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నెల్లిమండపల్లెలో గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్నవారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుగుణవతి, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వెంగంపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెంగంపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎండలో తిరగరాదన్నారు. గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ సుకన్య, వైద్య సిబ్బంది

రామభద్రాపురంలో..

గుడిపాల: మండలంలోని రామభద్రాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, మధుమేహం సమస్యలతో బాధపడుతున్న వారికి గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుకన్య వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది అనిత, అనురాధ, శివగామి, చంద్ర పాల్గొన్నారు.

26 నుంచి పలమనేరు ఉరుసు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని దండపల్లి రోడ్డు వద్ద వెలసిన హజరత్ గంజ్ షాహిద్ షావలి జలాలుద్దీన్ బాబా 75వ ఉరుసు మహోత్సవ పోస్టర్లను పార్లమెంటు సభ్యుడు రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం ఆవిష్కరించారు. ఈనెల 26న గంధం, 27,28 తారీఖుల్లో ఖవ్వాలీ కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు బీడీ మస్తాన్, సర్వర్, హైదర్, ఖదీర్, ఎజాజ్, అస్లాం తదితరులు తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో మున్సిపల్ ఆస్తుల గుర్తింపు



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31 వార్డుల పరిధిలో డ్రోన్ సర్వేను కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి గురువారం ప్రారంభించారు. స్థానిక ఎస్ఎస్‌పేట ప్రభుత్వ కళాశాలలో సర్వే కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపాలిటిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు, భవనాలు, కాలువలు, వంకలు, నదులు తదితర వాటిని సర్వే ద్వారా గుర్తిస్తామని తెలిపారు. వీటి సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్యం గుర్తించి మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆస్తులను గుర్తించడంతోపాటు ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుప్పంలో జాతర సందడి

కుప్పం: పట్టణంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం రాత్రి వినాయకస్వామి, గురువారం ముత్తుమారెమ్మ ఊరేగింపు పట్టణ పురవీధుల్లో వేడుకగా జరిగింది. ఆలయ ప్రాంగణం నుంచి మంగళవాయిద్యాల నడుమ నేతాజీరోడ్డు, ఆర్ఎస్‌పేట, రైల్వేగేటు వరకు ఊరేగింపు నిర్వహించారు.

రంజింపజేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవి డ్రామా కంపెనీ నటీనటులతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం విచ్చేశారు. బస్టాండు నుంచి అమ్మవారి ఆలయం వరకు జనం కిక్కిరిశారు. అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం పెద్ద సంఖ్యలో వీక్షించారు. టీవీ కళాకారుల డ్యాన్సులను చూసేందుకు జనం పెద్దసంఖ్యలో విచ్చేశారు.